


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 05-09-2023 సంపుటి : 05 సంచిక : 04 పేజీలు : 8 వెల : రూ 3-00

# హిందూమతంపై బురదజల్లే యత్నాలు

**ఇండియా కూటమినేతల తీరు ఆందోళనకరం**

**ఉదయనిధి వ్యాఖ్యలపై మండిపడ్డ పురంధేశ్వరి**



అమరావతి,సెప్టెంబర్4: సన్నాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయ్ నిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురంధేశ్వరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ... భారత రాజ్యాంగం ద్వారా ప్రమాణం చేసిన మంత్రి ఉదయ్‌స్టాలిన్, సనాతాన ధర్మాన్ని దోమల నిర్మూలన చర్యతో పోల్చి నిర్మూలించాలని తన ఆకాంక్షను వ్యక్తం చేయడం హేయమైన చర్య...రాజ్యాంగ విరుద్ధం. అదే వేదికపై, తమిళనాడులోని హిందూ మతపరమైన మరియు ధర్మాదాయ సంస్థలకు బాధ్యత వహించే పీకే శేఖర్‌బాబు ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా మౌనంగా ఉండడాన్ని దేనికి సంకేతం అంటూ ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని విచ్ఛిన్నం చేయడవే కూటమి ఉద్దేశమని ఐఎన్‌సీటీ తమిళనాడు అధ్యక్షుడు పేర్కొన్నారు. ఈ చర్యలు భారతదేశంలోని హిందూ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. విపక్ష కూటమి ఇండియా అని పేరు పెట్టుకోవడానికి కనీస నైతిక హక్కు కూడా వీరికి లేదు. 2010 సంవత్సరంలో హిందూ సంస్థలను లష్కరే తొయిబా సంస్థతో రాహుల్ గాంధీ పోల్చి మాట్లాడడం అత్యంత దారుణమని కూడా పురందేశ్వరి ఈ ట్వీట్‌లో గుర్తు చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బదీసే విధంగా ఇండియా కూటమిలోని నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే ఉదయినిధిని సమర్థిస్తూ కార్తిక్ చిదంబరం చేసిన వ్యాఖ్యలపై దగ్గుబాటి పురందేశ్వరి తీవ్రంగా మండిపడ్డారు.

# అనేక రంగాల్లో గణనీయమైన ప్రగతి

**9ఏళ్ల మోడీ పాలనలో దేశం పురోగతి**

**విశాఖలో పర్యాటక క్రూజ్ ప్రారంభంలో సోనోవాల్**



విశాఖపట్టణం,సెప్టెంబర్4(): ప్రధాని మోదీ నేతృత్వంలో 9 ఏళ్లలో దేశంలో అనేక రంగాల్లో గణనీయమనైన అభివృద్ధి సాధించామని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. సాగర మాల ప్రాజెక్ట్, పోర్ట్ కనెక్టవిటీ, కోస్టల్ కమ్యూనిటీ, కోస్టల్ డెవలప్మెంట్, షిపింగ్ మీద దృష్టి పెట్టామని కేంద్ర మంత్రి అన్నారు.. విశాఖ పోర్ట్, డిసిఐ, మారి టైం యూనివర్సిటీ, వివిధ ప్రాజెక్టులపై విశాఖలో సమీక్ష నిర్వహించారు. విశాఖలో కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 802 సాగర మాల ప్రాజెక్ట్ 5.6 లక్షల కోట్లుతో చేపట్టాం, పోర్టులు, మారిటైం బోర్డు ద్వారా ఈ అభివృద్ధి నిర్దేశించాం అన్నారు.ఒక్క ఏపీలోని 113 ప్రాజెక్టులకు 1.23 లక్షల కోట్లు కార్యకలాపాలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో ఇప్పటికే 36 ప్రాజెక్టులు పూర్తి కాగా, వీటి విలువ 32,210 కోట్లు అన్నారు. సాగర మాల ప్రాజెక్ట్ లో భాగంగా విశాఖ పోర్ట్ ఆధునికరణలో భాగంగా ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కోస్టల్ క్రూయిజ్ అభివృద్ధి చేస్తాం. జాతీయ, అంతర్జాతీయ క్రూయిజ్ కార్యకలాపాలకు అనుకులంగా ఉంటుందన్నారు. విశాఖ నుంచి చెన్నై, విశాఖ కలకత్తా, విశాఖ- ముంబయి గోవాకు, విశాఖ – కాండ్ల విహార యాత్ర, ప్రయాణ అవకాశాలు వస్తాయని, ద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. వీటితో పాటు ఆయిల్ బాట్, ట్రక్ పార్కింగ్ టెర్మినల్ ను ప్రారంభించనున్నారు. కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చి దిద్దుతాం. కార్గో ట్రాన్స్ పోర్ట్ విస్తరిస్తున్నాము. వైజాగ్ పోర్ట్ సాంకేతిక ఆధునిక పరిజ్ఞానం అభివృద్ధి చేశామన్నారు. విశాఖ పోర్ట్ ను మోడరనైజేషన్ మెకనైజాషన్ అభివృద్ధి పరుస్తాం. విశాఖ నుంచి 2030 నాటికి 1 మిలియన్ కంటైనర్లు రవాణా లక్ష్యం నిర్దేశించుకున్నట్లు కేంద్ర మంత్రి సోనోవాల్ తెలిపారు. సహకారంతో సాధ్యం అవుతోంది. విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. తూర్పు తీర ప్రాంతం విశాఖలో కేంద్ర షిప్పింగ్, పోర్ట్స్ మంత్రిత్వ శాఖతో పాటు టూరిజం శాఖ సంయుక్త సహకారంతో నూతనంగా నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్‌ను కేంద్ర మంత్రి సర్బానంద్ సోనోవాల్ ప్రారంభించారు. సుమారు 100 కోట్ల రూపాయల నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ టెర్మినల్‌ను ఏడాది కాలంలో నిర్మించారు.

# లొంగిపోయిన టీడీపీ ఇంచార్జ్ చల్లాబాబు



చిత్తూరు జిల్లా: పుంగునూరులో పోలీసులపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న టీడీపీ ఇంచార్జ్ చల్లాబాబు సోమవారం పోలీసులకు లొంగిపోయాడు. పుంగునూరులో పోలీసులపై దాడి అనంతరం తప్పించుకుని తిరుగుతున్న చల్లాబాబు నెలరోజుల తర్వాత లొంగిపోయాడు.ఆగస్టు 1వ తేదీనే అల్లర్లకు చంద్రబాబు అండ్‌కో స్కెచ్ వేసింది. పుంగనూరు హైవేపై చంద్రబాబు మీటింగ్ ఉంటే పుంగనూరు పట్టణంలోకి బలవంతంగా దూసుకెళ్లాలని పథకం వేశారు. పోలీసులు అడ్డుకుంటే కర్రలు, రాళ్లు బీర్ బాటిళ్లతో రెచ్చిపోవాలని ప్లాన్ చేశారు. అల్లర్లపై పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ చల్లా బాబుకు ముందే ఆదేశాలు వచ్చాయి. అంగళ్లు, పుంగనూరులో గొడవల పథకాన్ని వాంగ్మూలంలో చల్లా బాబు అనుచరులు స్పష్టంగా చెప్పారు.ఇప్పటివరకూ ఈ దాడి ఘటనకు సంబంధించి 110 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో 63 మంది టీడీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి జడ్జి ముందు హాజరుపరిచే అవకాశం ఉంది.

నేరాల్లో ఘనుడు చల్లా బాబు

పుంగనూరులో దాడి కేసులో ప్రధాన సూత్రదారి, పాత్రదారి ఆ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు అలియాస్ చల్లా రామచంద్రారెడ్డి అని పోలీసులు తేల్చారు. దాడులకు కుట్ర పన్నడం, వ్యూహాన్ని అమలుపరచడంలో ఇతనిదే ప్రధాన పాత్రగా పోలీసులు నిర్ధారించారు. చల్లా బాబు గత చరిత్ర అంతా నేర పూరితమేనని పోలీసు విచారణలో తేలింది. పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి. ఇతను ఆలయ భూములు, ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడినట్టు కూడా ఆరోపణలు ఉన్నాయి.

# బాబు జీవితమంతా కుట్రలు,కుతంత్రాలే



**వ్యవస్థలను మేనేజ్ చేయడం వెన్నతో పెట్టిన విద్య**

**ఐటిశాఖనే మోసం చేసినా నోరు మెదపడం లేదు**

**మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపణలు**

విశాఖపట్టణం, సెప్టెంబర్ 4: చంద్రబాబు జీవితం అంతా కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, వెన్నుపోటులతో సాగిందంటూ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబును మించిన వాళ్లు ఎవరూ ఉండరని వ్యాఖ్యానించారు. ఈసారి నేరుగా ఐటీ శాఖనే చంద్రబాబు ప్రజలను మోసం చేశాడంటూ, పెద్ద ఎత్తున స్కాం చేసి కోట్లలో డబ్బులు కొట్టేశాడని నోటీసులు జారీ చేస్తే... ఆయన స్పందించక పోవడం దారుణం అన్నారు. కనీసం తాను ఇది చేయలేదని కూడా అనట్లేదంటేనే.. ఆయన తప్పు చేసినట్లు అర్థం అవుతోందని వ్యాఖ్యానించారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చిన విషయంపై అనేక పేపర్లు, ఛానెళ్లలో వార్తలు వస్తున్నప్పటికీ.. ఆయన ఇప్పటికీ ఎందుకు స్పందించడం లేదో తెలియదని మంత్రి గుడివాడ అన్నారు. తనతో పాటు రాష్ట్ర ప్రజలు అందరూ బాబు సమాధానం కోసం వేచి చూస్తున్నారని అన్నారు. అలాగే చంద్రబాబు చరిత్రే ఓ చీకటి చరిత్ర అంటూ విమర్శించారు. దీని గురించి ఎవరికీ కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఆయన ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినటువంటి తీరు చూస్తేనే ఈ విషయం అర్థం అవుతుందంటూ చెప్పుకొచ్చారు. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు.. ఈ ఒక్క స్కాం ద్వారా చంద్రబాబు చేసిన అనేక స్కాంలు బయట పడతాయని మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పుకొచ్చారు. వీటి నుంచి ఆయన తప్పించుకోలేరంటూ కామెంట్లు చేశారు. 118 కోట్ల స్కాం చేశారంటూ ఐటీ శాఖ మొత్తం 46 పేజీలతో ఆగస్టు 4వ తేదీన నోటీసులు జారీ చేసిందని వివరించారు. అలాగే వీటికి ఏమాత్రం సంబంధం లేకుండా చంద్రబాబు ఇన్ కమ్ టాక్స్ ఆఫీసుకు నాలుగు లేఖరు రాశారని అన్నారు. వాళ్లు నోటీసులు ఇస్తే ఈయన స్పందించి మాట్లాడాల్సింది పోయి ఈ లేఖలు రాయడం ఏటంటూ ప్రశ్నించారు. నా పేరు మీకెవరు చెప్పారు, మీరెవరు అసలు నాకు నోటీసులు ఇవ్వడానికి అంటూ చంద్రబాబు లేఖలో పేర్కొన్న విషయాలు చూస్తుంటే తనకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తోందని అన్నారు. చంద్రబాబు లేఖల ద్వారా అడిగిన అన్ని ప్రశ్నలకు ఐటీ అధికారులు సమాధానం చెప్పారని వివరించారు. ఈ కేసు నుంచి చంద్రబాబు అస్సలే తప్పించుకోలేరని స్పష్టం చేశారు. అలాగే చంద్రబాబు నాయుడు అనే వ్యక్తి స్కిల్డ్ క్రిమినల్ అని, అన్ స్కిల్డ్ పొలిటీషియన్ అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్కాంల ద్వారా చంద్రబాబు దోచేసిన డబ్బు మొత్తాన్ని రికవరీ చేసి రాష్ట్ర ఖజానాకు తీసుకొస్తామని వివరించారు. అలాగే ఈ కేసులో బాబుకు సహకరించిన ఆయన కుమారుడు నారా లోకేష్ పేరు కూడా నోటీసుల్లో ఉందని మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. రాష్ట్రంలో టీడీపీ హయాంలో చేపట్టిన అన్ని సంక్షేమ పథకాల్లో చంద్రబాబు డబ్బును దోచేశారని ఆరోపించారు. అలాగే ఈడీ కూడా ఇందులో జోక్యం చేసుకుని ఈ కేడీని పట్టుకోవాలి అనేదే వైఎస్సార్సీపీ డిమాండ్ అంటూ మంత్రి పేర్కొన్నారు.

# చేనేత నేతకు ఘనంగా నివాళి

**అంతిమయాత్రలో పాల్గొన్న సిపిఎం నేతలు**

అనంతపురం,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు పోలా రామాంజనేయులు అంతిమయాత్ర సోమవారం ఉదయం ప్రారంభమయ్యింది. పార్టీ నేతలంతా రామాంజనేయులుకు జోహార్లు అర్పించారు. ఈ యాత్రలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, చేనేత నాయకులు, అభిమానులు, బంధువులు, పాల్గొన్నారు. ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు పోలా రామాంజనేయులు (71) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు పోలా లక్ష్మీనారాయణ సిపిఎం ధర్మవరం పట్టణ కార్యదర్శిగా పనిచేశారు.

# ఇస్రోలో విషాదం ..!

**కౌంట్ డౌన్ చెప్పే సైంటిస్ట్ మృతి**

**చంద్రయాన్-3 ప్రయోగం సమయమే**

**చివరి కౌంట్ డౌన్**



నెల్లూరు, సెప్టెంబర్ 4 : ఇస్రోలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాకెట్ ప్రయోగాల సమయంలో వినిపించే గొంతు మూగబోయింది. ఇస్రో సైంటిస్ట్ వాలార్మతి హఠాత్తుగా కన్నుమూశారు. శనివారం చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె గుండెపోటుతో చనిపోయారు. వాలార్మతి చివరిసారిగా జులై 14న ఇస్రో ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రయోగం సమయంలో కౌంట్ డౌన్ చెప్పారు. ఇస్రో చేపట్టే ఎన్నో ప్రయోగాల సమయంలో లైవ్ స్ట్రీమింగ్‌కు ఆమె వాయిస్ ఇచ్చేవారు. ఇస్రో ప్రయోగాల సమయంలో వినిపించే వాలార్మతి గొంతు దేశ ప్రజలందరి గుం డెల్లో నిలిచిపోతుంది. ఆమె మృతికి ఇస్రో సైంటిస్టులు సంతాపం తెలి పారు. 1959లో తమిళనాడులోని అరియలూర్‌లో జన్మించిన వలార్మతి 1984లో ఇస్రోలో సైంటిస్ట్‌గా చేరారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరుతో ఏర్పాటు చేసిన పుర స్కారాన్ని మొదటిసారిగా 2015లో వాలార్మతి అందు కున్నారు.

# అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు నియంత్రణ: లోకేశ



ఏలూరు: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ను ప.గో. జిల్లా ఉండి నియోజవర్గం పరిధిలోని కోలమూరు గ్రామస్థులు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు .తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని మొరపెట్టుకున్నారు." చాలా మంది ఆక్వారంగంపై ఆధార పడి ఉన్నారు. ఆక్వా రైతులందరికీ విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. కోలమూరులో 33 కేవీ సబ్ స్టేషన్ ఉన్నా అధిక విద్యుత్ కోతలు విధిస్తున్నారు. విద్యుత్ కోతల సమస్యతో రొయ్యలు డీఓ సమస్యతో చనిపోతున్నాయి. లో ఓల్టేజీ ఉండటంతో ఇళ్లలోని విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయి. పంట కాల్వల్లో పూడిక పేరుకుపోతోంది. పూడిక తీయకపోవడంతో పంటలకు సరిగా నీరు రావడం లేదు. వరి పంటకు సరైన గిట్టుబాటు ధర లేదు. పండిన పంటలకు వరదాలు ఇవ్వకపోవడంతో ధాన్యం తడిచి మొలకలు వస్తున్నాయి. విద్యుత్ బిల్లులు ఎక్కువ రావడంతో పెన్షన్లు తొలగిస్తున్నారు. నాసిరకం మద్యం తాగడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు." అంటూ లోకేశ్ ఎదుట తమ సమస్యలను ఏకరవుపెట్టారు.దీనిపై నారా లోకేశ్ మాట్లాడుతూ.. ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేంద్రం జల్ జీవన్ మిషన్ ద్వారా నిధులు కేటాయించగా, వాటిని వినియోగించుకోలేని చేతగాని ముఖ్యమంత్రి జగన్ అని మండిపడ్డారు. తెదేపా అధికారంలోకి రాగానే వాటర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ 24 గంటల పాటూ మంచినీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన జగన్‌కు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలన్న ఆలోచన లేదని విమర్శించారు." మేం అధికారంలోకి వచ్చాక లో ఓల్టేజ్ సమస్య లేకుండా ప్రజలకు, ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం. నీరు-చెట్టు ద్వారా తెదేపా హయాంలో కాల్వల్లో పూడిక తీయించే వాళ్లం. జగన్ వచ్చాక దాన్ని మరుగున పడేశారు. నీటి తీరువా పెంచి రైతుల్ని దోచుకుంటున్నారు తప్ప.. సాగునీటి కాల్వలపై దృష్టిపెట్టడం లేదు. తెదేపా అధికారంలోకి వచ్చాక యేటా కాల్వల మరమ్మతులు, పూడికతీత చేపడతాం.

# సంపాదకీయం

మంగళవారం 05-09-2023

## సర్వేపల్లి ఆశయం కొనసాగించాలి !

జాతీయ విద్యావిధానంలో తీసుకుంటున్న చర్యలకు చాలా రాష్ట్రాలు ఇప్పటికే మోకాలడ్డాయి. మోకాలు అడ్డుతున్నాయి కూడా. మనద దేశ సంస్కృతీ సంప్రదాయాలను విచ్ఛిన్నం చేసిన వారి చరిత్రను ఇంత కాలం చదివాం. ఇంకా చదవాలని కొందరు కుహనా లౌకికవాదులు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొనసాగు తున్నాయి. జాతీయ విద్యావిధానంలో భాగంగా తొలగించిన కొన్ని పాఠ్యాంశాలను ఇటీవల కేరళ ప్రభుత్వం వాటిని వాచక రూపంలో ప్రవేశ పెట్టింది. దేశాన్ని కట్టి ఉంచడానికి, సమాజాన్ని, ప్రజలను ఒకే గొడుకు కిందకు తీసుకుని రావడానికి, ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి కేవలం విద్య మాత్రమే దోహదం చేస్తుంది. సర్వేపల్లి రాధాకృష్ణ జయింతిన పురస్కరించిఉకుని ఏటా జయంతి ఉత్సవాలు జరుపుతున్నా ఆయన ఆశయాలను కొనసాగించే ప్రయత్నాల్లో చిత్తశుద్ధి మాత్రం కారావడం లేదు. అలాగే విద్యారంగానికి నిధులు కేటాయింపులు పెంచి ఏకీకృత విద్యావిధానం తీసుకుని రావాలి. ఉపాధ్యాయులను నియించి వారిని గౌరవించుకోవడమే గాకుండా పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు విద్యారంగాన్ని బలోపేతం చేసుకోవాలి. నిజానికి అక్షరాస్యతలో దేశం ఇంకా వెనకబడి ఉంది. వెనకబడిన ప్రాంతాలు, గిరిజన ప్రాంతా లకు విద్య అందడం లేదు. ఉపాధ్యాయులను ఏటా సత్కరించుకుంటున్నా.. పాఠశాలలను బలోపేతం చేయడంలో కానీ, ఉపాధ్యాయనియామకాల్లో గానీ పాలకులు పెద్దగా శ్రద్ధ తీసుకోవడం లేదు. ఉన్న స్కూళ్లను మూసేయడం, క్రమబద్ధీకరించడం చేస్తున్నారు. మారుమూల ప్రాంత పిల్లలకు సైతం విద్యను నేర్పాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన స్కూళ్లను క్రమబద్ధీకరణ పేరుతో మూసేయడం పాలకుల దాష్టీకానికి నిదర్శనంగా చూడాలి. ప్రైవేట్ రంగంలో విద్యను ప్రోత్సహించి విద్యావ్యాపారానికి పాలకులే తోడ్పడడం దారుణం. ఒకేదేశం, ఒకే పన్ను, ఒకే చట్టం అంటున్న మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కూడా జాతీయ విద్యా విధానం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా అది సంపూర్ణంగా కూడా సాకారం కావడం లేదు. ఏటా సెప్టెంబర్ 5న ఘనంగా గురుపూజోత్సవం జరుపు కుంటున్నాం. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకుంటున్నాం. ఏటా ఈ రెండు పండగలను ఘనంగా నిర్వహించుకుంటున్నా విద్య విషయంలో మాత్రం ఏకాభిప్రాయసాధనకు రావడం లేదు. అలాగే విద్యా రంగాన్ని పటిష్టం చేయాలన్న ఆలోచన గానీ,సంకల్పం కానీ కానరావడం లేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మన విద్యారంగం నీరసించి పోతోంది. ప్రైవేట్ విద్యారంగం బలపడుతోందే తప్ప ప్రభుత్వ విద్యావిధానం పట్టాలకెక్కడం లేదు. దీనికితోడు స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరతతో పాటు, సమస్యలు తిష్టవేసుకున్నాయి. వీటిని పరిశీలించి పరిష్కరించాల్సిన పాలకులు విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తున్నారు. విద్యారంగంలో మనం ముందుకు పోతున్నామని నాయకులు చెప్పింది నమ్మడానికి లేదు. స్కూళ్లు ప్రారంభమైనా ఉపాధ్యా యులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్యవైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు స్జబెక్టు టీచర్లు లేరు. రాష్ట్రంలోని కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. నేటికీ అనేక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందడం లేదు. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఇకపోతే ఎపిలో ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోదామని ప్రభుత్కవం భావిస్తున్నది. మాతృభాషలో బోధన జరగకుంటే మరింత వెనకబడి పోవడం ఖాయం. నిపుణులు ఇదే హెచ్చరిస్తున్నారు. తెలుగుమీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా? అని ఎదురు ప్రశ్న వేస్తున్నారు. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అని మరో ప్రశ్న. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? మరో ప్రశ్న. నిజానికి ప్రభుత్వ విద్యా బలోపేతంగా ఉంటే.. అదీ జాతీయ విధానంగా ఉంటే ఇలాంటి ప్రశ్నలు,మీమాంసలు రావు. దేశమంతా ఒకే విద్యావిధానం ఉండివుంటే సమస్యలు, చర్చలు ఉత్పన్నం కావు. ఇకపోతే ప్రాంతీయ భాషల్లో బోధన జరగాల్సిందే. అలాగే దేశానికి, ప్రపంచానికి అసవరమైన హిందీ, ఇంగ్లీషల్లో రాటుదేలేలా చేయాలి. ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగు తున్నారు. నిజానికి మాతృభాష లోనే పిల్లలు వేగంగా అర్థం చేసుకుని విషయ పరిజ్ఞానం పెంపొందించు కోగలరని పరిశోధనలు రుజువు చేశాయి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలందరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి,వారిని గతంలోలాగా గౌరవించే సంస్కృతిని బలోపేతం చేయాలి. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఈ సంకల్పం తీసుకోవాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి,సాంప్రదాయాలు నిలబడతాయని అందరి అభిప్రాయం. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకోవాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. మన దేశంలో అన్ని రాష్ట్రాలు వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తున్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాషలోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చుకోవడంలో తప్పులేదు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్, హిందీభాషలు నేర్పితే సరిపోతుంది. ప్రాంతీయ భాషలు ఏదైనా విద్య అన్నది ఒక్కతీరుగానే ఉండాలి. పాఠ్యాంశాలు ఒక్కటిగా ఉండాలి. బోధనా విధానం ఒక్కటిగానే ఉండాలి. అలాగే దేశ చరిత్ర, సంస్కృతి పరిణామాలు, సమగ్రంగా భవిష్యత్ తరానికి తెలియచేసేలా విద్యావిధానం ఉండాలి. టీచర్లను నియమించుకోవడం, గైరవించుకోవడం ద్వారా మన విద్యారంగాన్ని బలోపేతం చేయాలి.

## తత్వం అంటే జీవితాన్ని అర్థం చేసుకోవడమే

### భారతీయ తత్వాం అత్యున్నతమైన సంపద

### విదేశీ తత్వవేత్తను మెప్పించిన సర్వేపల్లి రాధాకృష్ణన్



న్యూఢిల్లీ,సెప్టెంబర్4(: భారతీయ ఆలోచనా దృక్పధాన్ని పాశ్చాత్య పరిభాషలో చెప్పి, మెప్పించిన ధీశాలి దివంతగ రాష్ట్రపతి సర్వేపల్లి ఆధాకృష్ణన్. అతను పాశ్చాత్య తత్వవేత్తలు ఎలా తమ భావనలను తమ సంస్కృతిలో అప్పటికే ఉన్న వేదాంత ప్రభావానికి ఎలా లోనవుతున్నారో చూపించాడు. అతని దృష్టిలో తత్వం అనేది జీవితాన్ని అర్థం చేసుకోవటానికి ఒక మార్గం. భారతీయ తత్వాన్ని అర్థం చేసు కోవటం అనేది ఒక సాంస్కృతిక చికిత్సగా భావించాడు. అందులో వివేకం, తర్కం ఇమిడి ఉన్నాయని చూపించి, భారతీయ తాత్వికచింతన ఏమాత్రం తక్కువ కాదని నిరూపించాడు. రాధాకృష్ణన్‌ది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారి వృత్తి చేయమ న్నాడు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతి మిషనరీ పాఠశాలలో చేరాడు. ఇక అప్పటినుంచీ ఇతను చదువంతా ఉపకారవేతనాలతోనే సాగిపోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కొనలేని పరిస్థితుల్లో అతను నేలను శుభ్రపరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో తత్వశాస్త్రంలో ఎం.ఏ పూర్తిచేసిన రాధాకృష్ణన్ ఇరవై ఏళ్ల వయసులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బోధకుడిగా చేరాడు. అతను పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. అతను రోజులో 12 గంటల పాటు పుస్తకాలు చదువుతూనే ఉండేవాడు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలను రాసేవాడు. రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పదవులు చేపట్టడమే కాదు, ఆంధ్రా యూనివర్సిటీ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతిగా పనిచేశాడు. రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశాడు. తను రాసిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రత్యేక ఆహ్వానంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగించాడు. 'యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్'లో సభ్యుడిగా ఉండి, విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చాడు. 1952లో బారతదేశ మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారత రెండో రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టాడు. 1954లో భారతరత్న పురస్కారం దక్కింది. ఏనాడూ ఎటువంటి ఆడంబరాలకు పోలేదు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనం లో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగి ఇచ్చాడు. ఞాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు, వారిపై, ప్రేమాభిమానాలు చూపేవాడు. అతను మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా వెళ్లేప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి, తమ గురువును కూర్చోబెట్టి, రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే లాక్కుంటూ వెళ్లారట. ఞాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు అతను శిష్యులు, అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని అతను కోరారట. ఆరోజు నుంచే అతను పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న జన్మించారు. భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా పనిచేసిన భారతీయ రాజకీయవేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు. రాధాకృష్ణన్ 1952 నుండి 1962 వరకు భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా పనిచేశాడు. 1949 నుండి 1952 వరకు సోవియట్ యూనియన్‌లో భారతదేశానికి రెండవ రాయబారిగా ఉన్నాడు. 1939 నుండి 1948 వరకు బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి నాల్గవ వైస్-ఛాన్సలర్‌గా, 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండవ వైస్-ఛాన్సలర్‌గా కూడా ఉన్నాడు. రాధాకృష్ణన్ తులనాత్మక మతం, తత్వశాస్త్రం 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన, విశిష్టమైన పండితులలో ఒకరిగా పరిగణించబడ్డాడు.

## రాష్ట్రంలో మరోమారు జోరు వర్షాలు

### జంటనగరాల్లో రెండ్రోజులుగా వానలు

### హైదరాబాద్‌లో అప్రమత్తం అయిన జిహెచ్ఎంసి

హైదరాబాద్,సెప్టెంబర్4): అల్పపీడన ప్రభావంతో వచ్చే మూడు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు వర్షాలు కురిసే సూచనలున్నాయని హైదాబాద్ వాతావరణశాఖతెలిపింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం నుంచి బుధవారం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు అతిభారీ వర్ష సూచన ఉన్నదని వాతావరణ శాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా జోరుగా వర్షం కురుస్తున్నది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీటికితోడు ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండటంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, హైదర్‌నగర్, నిజాంపేట, ప్రగతినగర్, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి, సూరారం, సుచిత్ర, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, బాలానగర్ ప్రాంతాల్లో ఉదయం నుంచి వర్షం కురుస్తున్నది. హైదరాబాద్ నగరానికి వాతావరణ శాఖ భారీ వర్ష సూచన చేసింది. హైదరాబాద్ మహా నగరంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. అలాగే సోమవారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. అర్ధరాత్రి తర్వాత చినుకులతో మొదలై.. ఉదయం 6 గంటల నుంచి గంటన్నర పాటు దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. అమీర్‌పేట, మైత్రీవనం, మయూర్ మార్గ్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై భారీగా వరద నిలిచిపోవడంతో ఉదయం బయటకు వచ్చిన వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు భవనాల్లో సెల్లార్లలోకి, నార్సింగ్ మున్సిపాలిటీ బాలాజీనగర్ కాలనీలో పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వందెంవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తెల్లవారుజామున కురిసిన వర్షంతో వాతావరణం మారడంతో నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో ఉదయం వేళ ట్రాఫిక్ సమస్యలు తలెత్తలేదు. ఆరు నుంచి 7.30 వరకు కురిసిన భారీ వర్షంతో రహదారులు చెరువులను తలపించాయి. బోరబండలో అత్యధికంగా 8.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. రోడ్లపై నిలిచిన నీటిని బయటకు పంపించేందుకు జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది చర్యలు చేపట్టారు. సీజన్ ప్రారంభమైన తర్వాత జూన్‌లో రెండు సార్లు, జూలైలో నాలుగు సార్లు మాత్రమే గ్రేటర్‌లో భారీ వర్షాలు నమోదయ్యాయి. రెండు వారాలుగా రెండు, మూడు సార్లు తేలికపాటి జల్లులు మినహా.. ఎక్కడా భారీ వర్షాలు లేవు. దీంతో నగరంలో పొడి వాతావరణం ఏర్పడి వేడి పెరిగింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మరో మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు నుంచి అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముంటుందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే నగర వాసులకు బల్దియా టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసింది. నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్లు 040-21111111, 9000113667ను ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే డిజాస్టర్ బృందాలు అప్రమత్తంగా ఉండాలంటూ అడిషనల్ కమిషనర్ ప్రకాష్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్‌కు పలు అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలాయి. అల్వాల్, రాంనగర్, సైనిక్‌పురి, మధురానగర్, అత్తాపూర్, బీఆర్‌కే భవన్, టోలిచౌకి, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల నుంచి చెట్లు కూలాయని 16, జూబ్లీహిల్స్, చికోటి గ్రైన్, ఆర్పీ రోడ్, పురానాపూల్, మాదాపూర్, షేక్‌పేట తదితర 16 ఏరియాల నుంచి వరద నీరు నిలిచాయన్న ఫిర్యాదులు వచ్చాయి. ఖైరతాబాద్‌లో పాత గోడ కూలగా.. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. 35 ఫిర్యాదులు రాగా.. 34 పరిష్కరించినట్టు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు మళ్లీ ఊపందుకున్నాయి. సోమవారం ఉదయం నుంచి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురుస్తుండగా, ఉమ్మడి నిజామాబాద్ ,మెదక్ జిల్లాల్లో కుండపోతగా వర్షం కురుస్తున్నది. రాజధానిలో ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తూ ఉన్నది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఖైరతాబాద్, మెహదీపట్నం, నాంపల్లిలో జల్లులు పడుతున్నాయి. ఇక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం వస్తున్నది. ఇందల్వాయి, డిచ్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లిలో వాన దంచికొడు తున్నది. అత్యధికంగా డిచ్‌పల్లి మండలం గన్నారంలో 14 సెంటీమీటర్ల వర్షం పడింది. గాంధారి, సిరికొండ మండలంలోని చీమనుపల్లిలో 12 సెం.మీ, సదాశివనగర్ జుక్కల్, జక్రాన్‌పల్లిలో 11 సెం.మీ, డిచ్‌పల్లి, మదన్‌పల్లిలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. శ్రీరాంసాగర్‌కు మరోమారు వరద పోటెత్తింది. ఇక భూపాలపల్లి జిల్లాలో ఆదివారం నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తున్నది. దీంతో సింగరేణి ఓపెన్‌కాస్ట్ 2, 3 గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. కాగా, నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ నేడు సెలవు ప్రకటించారు. భారీ వానలతో పలుచోట్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారుఉమ్మడి మెదక్ జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. సంగారెడ్డి జిల్లా కంగ్టిలో అత్యధికంగా 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మెదక్ జిల్లా కౌడిపల్లిలో 8.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఆదివారం ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో వచ్చే 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణశాఖ

తెలిపింది. అల్పపీడన ప్రభావంతో వచ్చే మూడు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు వర్షాలు కురిసే సూచనలున్నాయని హైదాబాద్ వాతావరణశాఖ తెలిపింది. సోమవారం నుంచి మంగళవారం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం నుంచి బుధవారం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు అతిభారీ వర్ష సూచన ఉన్నదని వాతావరణ శాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ , ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది.

## తుమ్మల చేరితే కాంగ్రెస్ మరింత బలోపేతం

### ఇప్పటికే పొంగులేటి రాకతో పెరిగిన జోష్

### ఉమ్మడి జిల్లాలో బిఆర్ఎస్‌కు కష్టమే అంటున్న నేతలు

ఖమ్మం,సెప్టెంబర్4: ఖమ్మం జిల్లా రాజకీయాలు ఇప్పుడు మాజీమంత్రి తుమమల నాగేశ్వరరావు చుట్టూ తిరుగుతున్నాయి. మొన్నటి వరకు పొంగగులేటి, ఇప్పుడు తుమమల అన్నచందంగా రాజకీయ పరిణామాలు మారాయి. తుమ్మల దాదాపుగా బిఆర్ఎస్‌ను విడిపోయినట్లే అన్న ప్రచారం కూడా జోరందుకుంది. తుమ్మలను దగ్గరకు తీసుకోవాలని, ఓదార్చాలన్న ప్రయత్నాలు బిఆర్ఎస్ నుంచి కానారవడం లేదు. దీంతో ఆయన బిఆర్ఎస్‌ను వీడడం ఖాయమని అంటున్నారు. దీంతో ఖమ్మంలో ఇప్పుడు కాంగ్రెస్ మరింత బలోపేతం కానుందని అంటున్నారు. ఖమ్మంలో బిఆర్ఎస్‌కు పెద్దగా పట్టులేదు. పొంగులేటి తరవాత తుమ్మల చేరితే కాంగ్రెస్‌కు తిరుగు ఉండదన్న భావన వస్తోంది. బీఆర్ఎస్ అధినాయకత్వంపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పీసీసీ అధ్యక్షుడు రేవంతరెడ్డి, తదితర కాంగ్రెస్ నేతలు ఇటీవల హైదరాబాదులో తుమ్మల నివాసంలో కలిసి పార్టీలోకి ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన మరోసారి తన అనుచరులతో సమావేశమై నిర్ణయం తీసుకుంటానని వారికి చెప్పిన నేపథ్యంలో ముఖ్యనేతలతో సమావేశం కానున్న తుమ్మల పార్టీమార్పుపై చర్చించనున్నారు. ఈనెల 6 లేదా 9వతేదీన ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తుమ్మల ఏం నిర్ణయం నిర్వహించి తుమ్మల నిర్ణయమే తమ నిర్ణయమని, ఆయన ఏపార్టీలో చేరినాఆయనతోపాటే తాముంటామంటూ మద్దతు ప్రకటించారు.

## షేక్ హ్యాండ్ ఇచ్చుకున్న ఉప్పు,నిప్పు నేతలు

జనగామ,సెప్టెంబర్4 పాలకుర్తి మండలం వల్మిడి సీతారాముల ఆలయం పున: ప్రతిష్టలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ఇంతకాలం ఉప్పు – నిప్పులా ఉన్న స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఒకే వేదికపై ఒకరికొకరు తారసపడ్డారు. ఇద్దరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకుని చక్కగా పలకరించుకున్నారు.

ఇద్దరూ కలసి కూర్చోవడంతో సభికులంతా ఆసక్తిగా చూశారు. అది గమనించిన రాజయ్యకు ఏమనిపించిందో ఏమో కానీ మధ్యలోనే సడెన్‌గా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇటీవలి కాలంలో కడియం, రాజయ్యల మధ్య పెద్ద ఎత్తున విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరూ రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యారు.

# మోదుగులకా... లావుకా

గుంటూరు, సెప్టెంబర్ 4, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఆయనో ఫైర్ బ్రాండ్. మనసుకు ఏది అనిపిస్తే అది కుండ బద్దలు కొట్టాల్సిందే. ఈ ముక్కుసూటి తనమే ఆయన రాజకీయ జీవితానికి ఇబ్బందికరంగా మారింది. ఒకానొక సందర్భంలో మైక్ పట్టుకున్నారంటే సొంత పార్టీ అని కూడా ఆలోచించరు. ఇక ఎడాపెడా మాట్లాడాల్సిందే. మరోవైపు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజినీతో ఎంపీకి అసలు పొసగదు. అంతేకాదు విడుదల రజినీకి వ్యతిరేకంగా మర్రి రాజశేఖర్‌తో కలిసి ఓ వర్గాన్ని సైతం ఏర్పాటు చేశారనే ప్రచారం కూడా ఉంది. ఇంతకీ ఆ ఎంపీ ఎవరో తెలిసే ఉంటుంది కదూ. ఇంకెవరు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు. అయితే శ్రీకృష్ణ దేవరాయులు వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తారనే ప్రచారం కూడా జరుగుతుంది. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఎంపీగా పోటీ చేసేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎంపీగా ఉండటం వల్ల ప్రజల్లోకి చొచ్చుకుని వెళ్లలేకపోతున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు అభిప్రాయపడుతున్నారు.కేవలం ఎంపీగా బహిరంగ సమావేశాలకు వెళ్లి ఏదో మె?క్కుబడిగా పాల్గొని... ప్రసంగాలకే పరిమితం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అసమ్మతి సెగ వచ్చే ఎన్నికల్లో ఇబ్బందికరంగా మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును పొన్నూరు ఎమ్మెల్యేగా బరిలోకి దిగాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనను ఇప్పటికే ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు వైసీపీ అధిష్టానం వద్ద ఉంచినట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడు అయిన ప్రస్తుత రాజ్యసభ సభ్యులు ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించాలనే యోచన వైసీపీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌కు వైసీపీ అధిష్టానం వద్ద మంచి పట్టుంది. అంతేకాదు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూడా నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీకి పెద్దదిక్కుగా వ్యవహరిస్తున్నారు. అంతేకాదు మత్స్యకార సామాజిక వర్గానికి కొండంత అండగా నిలుస్తున్నారు. ఈ పరిణామాలు మోదుగుల వేణుగోపాల్ గెలుపునకు దోహదపడతాయనే ప్రచారం ఉంది.

# పశ్చిమ డెల్టాలో ఎండిపోతున్న పంటలు

గుంటూరు, సెప్టెంబర్ 4, వాన చుక్క రాలదు. కాలువలో నీరు పారదు. కళ్ల ముందే సాగు చేస్తున్న పైరు ఎండిపోతుంటే ఆకాశం వైపు చూపు నిలవదు. సాగు తప్ప మరోటి తెలియని అన్నదాతల వేల రూపాయల పెట్టుబడి పెట్టి సాగునీటి కోసం నిరీక్షిస్తున్నాడు. వాన దేవుడు కరుణించకపోతాడా? కాలువలో ఒక్క తడికైనా నీరు రాకపోతుందా అన్న ఆశతో జీవనం సాగిస్తున్నాడు. పల్నాడు ప్రాంతంతో పాటు గుంటూరు జిల్లాలోనూ సాగు నీటి కొరత నెలకొంది. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో తీవ్ర సాగు నీటి ఎద్దడి నెలకొంది. వర్షాలు సకాలంలో రాకపోవడం ఒక వైపు ప్రాజెక్టుల్లో నీరు చేరకపోవడంతో పంటలు సాగు చేసేందుకు అవసరమైన నీరు అందటం లేదు. దీంతో కొద్దిపాటి వర్షానికి సాగు మొదలు పెట్టిన రైతన్నలు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు.గుంటూరు జిల్లాలోని కృష్ణా పశ్చిమ డెల్టాలో యాభై ఐదు వేల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. ప్రకాశం బ్యారేజ్ వద్ద నుండి కృష్ణా పశ్చిమ కెనాల్ ద్వారా సాగునీరు గుంటూరు జిల్లాలోని డెల్టా ప్రాంతానికి అందుతుంది. పశ్చిమ కాలువను పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించారు. అయితే ప్రతి ఏటా ఆరు వేల నుండి ఏడు వేల క్యూసెక్కుల నీటిని ఈ సీజన్ లో వదులుతారు. దీంతో తగినంత నీరు ఉండి రైతులు తమ పంటలు సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది మాత్రం నాలుగు వేల క్యూసెక్కుల నీరు మాత్రమే పశ్చిమ కాలువకు విడుదల చేస్తున్నారు. దీంతో తెనాలి రూరల్ మండలంలోని బ్రాంచ్ కెనాల్ కింద సాగవుతున్న భూములకు నీరు అందటం లేదుఇప్పటికే ఎకరానికి కౌలు కాకుండా పదివేల రూపాయల పెట్టుబడి పెట్టిన రైతన్నలు పంటను రక్షించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంజన్లు, మోటార్ల ద్వారా నీళ్లను పంటలకు మళ్లిస్తున్నారు. కాలువలపై ఉన్న మోటార్లు నడవటానికి అవసరమైన విద్యుత్ కూడా లేకపోవడంతో ఇంజన్లనే నమ్ముకుంటున్నారు. అయితే వరి అత్యధికంగా సాగు చేస్తుండటంతో సకాలంలో అన్ని ఎకరాలను నీటిని పెట్టుకోలేకపోతున్నారు. మరో పది రోజుల్లో వర్షాలు లేకపోతో ఈ ఏడాది ఖరీఫ్ పంట పోయినట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు. మినుము, పెసర వంటి పంటలను జనవరి తర్వాతే సాగు చేసే అవకాశం ఉంటుందంటున్నారు. దీంతో వేసిన పంటను ఎలాగైనా రక్షించుకోవాలన్న తపనతో పొలం గట్లపైనే రైతన్నలు కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాలు లేక పంటలపై ఆధారపడ్డ రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సాగు నీటి కరువుతో పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు.

# విశాఖలో మరో పర్యాటక మణిహారం

విశాఖపట్టణం, సెప్టెంబర్ 4, విశాఖ సిటీ సిగలో మరో ప్రతిష్టాత్మక పర్యాటక మణిహారం చేరనుంది. సముద్ర విహారంపై ఆసక్తి చూపే పర్యాటకుల కోసం విశాఖ పోర్టులో క్రూయిజ్ టెర్మినల్ ముస్తాబైంది. వివిధ దేశాల పర్యాటకులు క్రూయిజ్‌లో వచ్చి విశాఖ నగరంలో పర్యటించేలా ఈ టెర్మినల్‌లో వివిధ ఏర్పాట్లు చేశారు. పోర్టులోని గ్రీన్ చానల్ బెర్త్‌లో రూ.96.05 కోట్లతో ఈ సముద్ర విహార కేంద్రాన్ని నిర్మించారు. ఇందుకోసం కేంద్ర టూరిజం శాఖ 38.50 కోట్ల రూపాయలు కేటాయించింది. క్రూయిజ్ షిప్స్‌తోపాటు భారీ కార్గో నౌకల హ్యాండ్లింగ్‌కు అనుగుణంగా క్రూయిజ్ టెర్మినల్‌ను తీర్చిదిద్దారు. సోమవారం కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభించనున్నారు. భారత్‌లో క్రూయిజ్ టూరిజానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ టెర్మినల్ నిర్వహణలో ఏపీ టూరిజం, కేంద్ర టూరిజం శాఖలతో కలిసి విశాఖపట్నం పోర్టు పని చేయనుంది. ప్రస్తుతం 7.1 యూఎస్ బిలియన్ డాలర్ల మార్కెట్ ఉంది. రానున్న పదేళ్లలో 12.1 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా క్రూయిజ్ రంగం 1.17 మిలియన్ల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. దీని కారణంగా ఆంధ్రప్రదేశ్ లో కూడా పర్యాటక రంగం వృద్ధి చెందటంతో పాటు ఉద్యోగ కల్పన కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయి.ఆంధ్ర ప్రదేశ్‌లో బీచ్‌లు, కొండలు, గుహలు, వైల్డ్ లైఫ్, అడవులు, ఆలయాలు వంటి విభిన్న రకాల పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. దేశీయ పర్యాటక ప్రదేశాలలో ఆంధ్రప్రదేశ్ 14 శాతం పర్యాటకులను అకట్టుకుంటూ దేశంలో మూడో ప్లేస్‌లో ఉంది. అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య ఏటా పెరుగుతోంది. క్రూయిజ్ సేవలు ప్రారంభమైతే రాష్ట్రంలో ఇంటర్నేషనల్ టూరిజం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.2000 మంది ప్యాసింజర్లను తీసుకువెళ్లే సామర్థ్యం కలిగిన వెసెల్స్‌ను నిర్వహించే సామర్థ్యం ఈ టెర్మినల్ సొంతం.

# హ్యాట్రిక్ కోసం నాని వ్యూహాలు



విజయవాడ, సెప్టెంబర్ 4,తెలుగుదేశం పార్టీలో విజయవాడ ఎంపీ కేశినేని ఏకు మేకై కాబోతున్నారా? టీడీపీ నేతలతోపాటు అధిష్టానంతో అమీతుమీ తేల్చుకునేందుకు రెడీ అయ్యారా? నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు డుమ్మా కొట్టిన కేశినేని నాని వచ్చే ఎన్నికల్లో తనదే టికెట్ అని అంత గంటా పథంగా ఎలా చెప్తున్నారు? విజయవాడలో తీవ్ర అసమ్మతి ఎదుర్కొంటున్న కేశినేని నాని ముచ్చటగా మూడోసారి ఎంపీగా గెలుపొందుతానంటూ చెప్పడంలో వ్యూహం ఏమిటి? లోకేశ్ ఆశీస్సులు లేకుండానే ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. విజయవాడ ఎంపీ కేశినేని నాని ఇప్పుడు టీడీపీలో సంచలనంగా మారారు. విజయవాడ మేయర్ ఎన్నికల్లో తన కుమార్తె మేయర్ కాకుండా అడ్డుకుంది తన సొంత పార్టీ నేతలేనని ఎంపీ కేశినేని ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి కేశినేని నాని వారికి దూరంగా ఉంటున్నారు. తాజాగా కేశినేని నాని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థిని ప్రకటించేశారు. విజయవాడ పశ్చిమ నుంచి బేగ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించుకుంటానని ధీమా వ్యక్తం చేయడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తుంది.తెలుగుదేశం పార్టీలో ఓ వెలుగు వెలుగొందుతున్న విజయవాడ ఎంపీ కేశినేని నానికి అసమ్మతి వర్గం చెక్ పెట్టింది. ఎంపీ కేశినేని నాని తనకుమార్తె కేశినేని శ్వేతను మేయర్‌గా చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకు బెజవాడ కేంద్రంగా టీడీపీలో రాజకీయం చేస్తున్న నాయకులు ఎంపీ కేశినేని నానికి ప్రత్యర్థులుగా మారారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమా మహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నాగుల్ మీరాలు ఆ మేయర్ ఎన్నికల్లో సహాయ నిరాకరణ చేశారు. అంతేకాదు టీడీపీ అభ్యర్థుల తరఫున చంద్రబాబు నాయుడు ప్రచారం చేసే రూట్ మ్యాప్ విషయంలోనూ విభేధాలు తలెత్తాయి. దీంతో శ్వేతను మేయర్ కుర్చీలో కూర్చోబెట్టుకోలేకపోయారు కేశినేని నాని. అనంతరం విజయవాడ కేంద్రం అసమ్మతి వర్గం కేశినేని నానికి చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు మె?దలు పెట్టింది. ఇందులో భాగంగా కేశినేని నాని సోదరుడు కేశినేని చిన్నిని తెరపైకి తీసుకువచ్చింది. కేశినేని చిన్నికి అండగా నిలుస్తూ వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించాలని అసమ్మతి వర్గం ప్రయత్నాలు చేస్తోంది. అసమ్మతి వర్గం అండదండలతో కేశినేని చిన్ని దూసుకుపోతున్నారు. టీడీపీ మహానాడులో కానీ ఇటీవల లోకేశ్ యువగళం పాదయాత్రలో కానీ అన్నీ తామై వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం ఎంపీ కేశినేని నానికి నచ్చడం లేదు. అసమ్మతి వర్గానికి ఎలా చెక్ పెట్టాలనే దానిపై వ్యూహరచన చేస్తున్నారు. ఇందులో భాగంగా వైసీపీ నేతలను పొగడ్తలతో ముంచెత్తుతున్న సంగతి తెలిసిందే.ఇదిలా ఉంటే విజయవాడ ఎంపీ కేశినేని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నుంచి ఎవరు అడ్డొచ్చినా బేగ్‌ను ఎమ్మెల్యేగా చేస్తానంటూ సంచలన ప్రకటన చేశారు. బేగ్ అభ్యర్థిగా అధిష్టానం ఇంకా ప్రకటించలేదు. అయితే ఎంపీ కేశినేని నాని ఈ ప్రకటన చేయడంపై రాజకీయంగా దుమారం రేపుతోంది. ఎందుకంటే ఈ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నాగుల్ మీరాలు టికెట్ ఆశిస్తున్నారు. ఇందుకు సంబంధించి పలు ప్రకటనలు సైతం చేశారు. మరోవైపు విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీని కాపాడేందుకు తామిద్దరం పనిచేసినట్టుగా నాగుల్ మీరా అప్పట్లోనే ప్రకటించారు. అంటే అధిష్టానం ఇద్దరిలో ఎవరో ఒకరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని పరోక్షంగా ప్రకటించారు. ఇలాంటి తరుణంలో ఎంపీ కేశినేని నాని అటు బుద్దా వెంకన్న, ఇటు నాగుల్ మీరాలకు చెక్ పెట్టేలా ఈ ప్రకటనలు చేయడం విజయవాడ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ జరుగుతుంది.

# ఏసీబీ కేసులో అరెస్టైన 24 గంటల్లో మళ్లీ విధులు

విజయనగరం, సెప్టెంబర్ 4, ఏసిబి అధికారులు అరెస్ట్ చేసిన ఎల్కక్ట్రికల్ ఏఈ పోలాకి శాంతారావు వ్యవహారంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఏసిబి అధికారులకే సవాలు విసిరి అరెస్ట్ అయిన కొద్ది గంటల్లోనే విధులకు హాజరై సంచలనం సృష్టించాడు శాంతారావు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం మునక్కాయ వలస వద్ద గత నెల 27 న ఈశ్వర రావు అనే ఓ రైతు నుండి లంచం తీసుకుంటుండగా ఎలక్ట్రికల్ ఏఈ శాంతారావును ట్రాప్ చేయడానికి ప్రయత్నించారు ఏసిబి అధికారులు. అయితే ఆ సమయంలో ఏసిబి అధికారులను గమనించిన శాంతారావు కారులో డోర్స్ వేసుకొని ఎదురుగా ఉన్న పంట పొలాల్లోకి కారుతో దూసుకెళ్లి పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో ఎలాగైనా శాంతారావును పట్టుకోవాలని ప్రయత్నించిన ఏసిబి సి ఐ శ్రీనువాసరావు వెంటనే ప్రక్కనే ఉన్న ఒక బైక్ తీసుకొని కారును వెంబడించాడు. అలా చేజ్ చేస్తున్నప్పటికీ ఏ ఈ శాంతారావు ఏ మాత్రం తగ్గకుండా సిఐ బైక్ ని తన కారుతో బలంగా ఢీకొట్టాడు. ఆ ప్రమాదంలో సిఐ శ్రీనువాసరావు ప్రాణాపాయం నుండి తృటిలో తప్పించుకున్నా గాయాల పాలయ్యాడు. దీంతో మిగిలిన సిబ్బంది శాంతారావ్ కోసం వెంబడించిన ఫలితం లేదు. రాత్రి సమయం కావడంతో ఏసిబి అధికారులకు దొరక్కుండా తప్పించుకోగలిగాడు.అయితే జరిగిన ఘటనతో ఖంగు తిన్న ఏసిబి అధికారులు ప్రత్యేక బృందాలతో గాలించిన అధికారులు ఎట్టకేలకు ఏ ఈ శాంతారావును విశాఖలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టుకు హాజరు పరిచారు. అయితే కేసును పరిశీలించిన కోర్టు శాంతారావు కు 41 ఏ నోటీసులు ఇచ్చి విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో ఏసిబి అధికారులు వెంటనే 41ఏ నోటీసులు ఇవ్వడం, శాంతారావును విడుదల చేయడం చకచకా జరిగిపోయాయి. అలా విడుదల అయిన మరుక్షణమే మక్కువ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఆఫీస్ లో విధులకు హాజరయ్యాడు. ఆఫీస్ కి వచ్చిన శాంతారావుకు ఆఫీస్ సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఇదే అంశం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం గా మారి అనేక అనుమానాలకు దారి తీస్తుంది. ఏసిబి అధికారులను ముప్పు తిప్పలు పెట్టడంతో పాటు కారుతో సి ఐ ను ఢీకొట్టి పరారైన ఎలక్ట్రికల్ ఏ ఈ శాంతారావు ఎలా అంత ఈజీగా క్షణాల్లో విధుల్లోకి జాయిన్ అవ్వగలిగాడు అన్న చర్చ జోరుగా సాగుతుంది. ఈ వ్యవహారంలో ఏఈ శాంతారావు అటు అధికారులు, పలువురు రాజకీయ నాయకులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా ఏసిబి డిఎస్పీ రామచంద్రరావు పై సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిఎస్పీ రామచంద్ర రావు, శాంతారావు ఒకే సామాజిక వర్గం వారు కావడంతో శాంతారావుకు తక్షణమే బెయిల్ వచ్చేలా డిఎస్పీ కూడా సహకరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయిఅందుకోసమే కేసు వీక్ అయ్యేలా ఫైల్స్ తయారు చేశారని చెప్పుకొస్తున్నారు. దీంతో అనుకున్నట్లే కేసు పరిశీలించిన కోర్టు శాంతారావు కు 41ఏ నోటీస్ ఇచ్చి విడుదల చేయాలని ఆదేశించిందని, అలా శాంతారావు అరెస్ట్ నుండి తప్పించుకోగలిగాడని అంటున్నారు. ఏసిబి అధికారుల నుండి తప్పించుకునే ప్రయత్నంలో అడ్డుకున్న ఏసిబి, సి ఐ శ్రీనివాసరావుని శాంతారావు కారుతో ఢీకొట్టాడు. ఆ ప్రమాదంలో సి ఐ శ్రీనువాసరావు తీవ్ర గాయాల పాలయ్యాడు. విధి నిర్వహణలో ఉన్న సి ఐ పై దాడితో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాల్సి ఉండగా ఆ సంబంధిత సెక్షన్ల క్రింద కూడా కేసు నమోదు చేయకుండా శాంతా రావుకు సహకరించారని పలువురు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా సుమారు ఐదు రోజుల పాటు పరారీ కారణంగా మండల విద్యుత్ ఆఫీస్ కి హాజరుకాకుండా, సెలవు కూడా పెట్టని శాంతారావు పై అటు విద్యుత్ శాఖ అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కూడా మరింత అనుమానాలకు దారి తీస్తుంది. ప్రస్తుతం ఏసిబి అధికారుల పై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నా, వారు కనీసం పెదవి విప్పకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. తమ పై వస్తున్న విమర్శలు, ఆరోపణల పై ఏసిబి అధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

# భయపడుతున్న చిరుతలు

తిరుపతి, సెప్టెంబర్ 4, గత కొన్ని రోజులుగా తిరుమలలో చిరుత సంచారం భయాందోళనకు గురిచేస్తున్న సంగతి తెలిసిందే. దీని కోసం అధికారులు ఆపరేషన్ చిరుత కూడా చేపట్టి చిరుతల్ని పట్టుకున్నారు. తాజాగా అలిపిరి నడకమార్గం నరశింహస్వామి ఆలయ సమీపంలో చిరుత సంచారాన్ని గుర్తించారు. గతంలో ఇదే ప్రాంతంలో రెండు చిరుతలను అధికారులు ట్రాప్ చేశారు. ఇక నిరంతరాయంగా చిరుతల కదలికలను గుర్తించేలా ఏర్పాట్లు చేసిన అధికారులు ఇప్పటి వరకు నాలుగు చిరుతలను ట్రాప్ చేశారు. అదేవిధంగా నడకమార్గంలో శాశ్వత ప్రాతిపాదికన ట్రాప్ కెమెరాలను టీటీడీ ఏర్పాటు చేసింది.కేవలం తిరుమలలో మాత్రమే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చిరుతల సంచారం భయాందోళలకు గురిచేస్తోంది. తాజాగా శ్రీశైలంలో చిరుతపులి సంచారానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. నిన్న సాయంత్ర రుద్రాపార్కు సమీపంలోని గోడపై చిరుత కూర్చొని ఉండగా యాత్రికులు సెల్ ఫోన్ లో దానిని చిత్రీకరించారు. దీంతో స్థానిక ప్రజలు భయపడిపోతున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని లేదంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని విన్నవిస్తున్నారు. మరోవైపు రామ కుప్పం మండలంలో కూడా చిరుత హల్ చల్ చేసింది. పీఎంకే తాండాలో లేగ దూడపై దాడి చేసి చంపేసింది. తరచూ తమ ప్రాంతంలో చిరుత సంచరిస్తుందని తెలిపిన గ్రామ ప్రజలు.. అక్కడ ఉండాలంటేనే భయంగా ఉందంటూ, చిరుత బెడద నుంచి తమను కాపాడాలని వేడుకుంటున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా చిరుతలు సంచారించడంతో ప్రభుత్వం అప్రమత్తమయ్యి వాటిని పట్టుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే ప్రసిద్ధ తిరుమలలో చిరత దాడిలో ఓ చిన్నారి చనిపోయిన విషయం తెలిసిందే. ఈ సంఘటన శ్రీవారి భక్తులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.తిరుమలలో కాలినడకన కొండపైకి వెళ్తున్న భక్తులు మెట్టు మెట్టుకూ భయంతో అడుగులు వేస్తున్నారు. శ్రీవారి మెట్టు నడక మార్గంలో బిక్కుబిక్కుమంటూ అడుగులో అడుగు వేస్తున్నారు. నల్లటి ఎలుగును చూడగానే.. భక్తులు పరుగులు పెడుతున్నారు. అది ఎక్కడ తమపై దాడి చేస్తుందోనని భయంతో వణికిపోతున్నారు. దీంతో అప్రమత్తమైన టీటీడీ అధికారులు గాలిస్తున్నా.. దాని జాడ మాత్రం ఇప్పటికీ కనిపెట్టలేకపోయారు. చిరుత, ఎలుగుబంటి. ఈ రెండు బంధిస్తే నడక మార్గంలో ఆపరేషన్ క్లోజ్ అవుతుందని అటవీ అధికారులు భావించారు. అయితే ఎలుగుబంటి ఏమైందో మాత్రం ఇప్పటిదాకా చెప్పలేక పోతున్నారు. నాలుగు చిరుతలను పట్టిన అటవీ శాఖ ఎలుగుబంటిని మాత్రం పట్టలేకపోతోంది.శ్రీవారి మెట్టు మార్గం, అలిపిరి నడకమార్గం రెండుచోట్ల హడావిడి చేస్తున్న ఎలుగుబంటిని బంధించడం ఇప్పుడు సవాలుగా మారింది. నాలుగు బోన్లను ఎలుగుబంటి ఆపరేషన్ కోసమే వినియోగిస్తున్న అటవీశాఖ 150 మంది సిబ్బందిని కూడా వినియోగిస్తోంది. అయితే తెలివిగా వ్యవహరిస్తున్న ఎలుగుబంటి సిబ్బంది కి దొరక్కుండా వలలో చిక్కకుండా రెండు నడక మార్గాల్లో సంచరిస్తూనే ఉంది.

# గుడివాడ టిక్కెట్ వెనిగండ్లకే..

విజయవాడ, సెప్టెంబర్ 4, ఉమ్మడి కృష్ణా జిల్లాలో కీలకమైన స్థానాలకు అభ్యర్థుల ఎంపికను తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు వేగవంతం చేశారు. కృష్ణా జిల్లాలో తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్థానాల్లో గన్నవరం, గుడివాడ ముఖ్యమైనవి. ఈ రెండు స్థానాల్లో ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఒకప్పుడు టీడీపీ నుంచి గెలిచి వైసీపీలో చేరిన వారు ఉన్నారు. గన్నవరం నుంచి వల్లభనేని వంశీ, గుడివాడ నుంచి కొడాలి నాని ఇద్దరూ కూడా టీడీపీ రాజకీయ జీవితం ప్రారంభించినవారే. వైసీపీలో చేరిన తర్వాత చంద్రబాబుతో పాటు తెలుగుదేశం పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. అందుకే ఈ ఇద్దరినీ వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ గడప తొక్కకుండా చూడాలని గట్టి పట్టుదలతో ఉన్నారు చంద్రబాబు. ఇప్పటికే గన్నవరం నుంచి వంశీకి పోటీగా యార్లగడ్డ వెంకట్రావు?కు టిక్కెట్ కన్ఫర్మ్ చేశారు. మరో స్థానం గుడివాడ. ఒకప్పుడు టీడీపీ నుంచి రెండుసార్లు గెలిచి ఆ తర్వాత వైసీపీలో చేరారు కొడాలి నాని. వరుసగా వైసీపీలో కూడా రెండుసార్లు గెలిచారు. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొడాలి నానిని ఢీకొట్టాలంటే సామాజికంగా,ఆర్థికంగా బలమైన నేత ఉండాలనేది చంద్రబాబు ఆలోచన. ప్రస్తుతం గుడివాడ టీడీపీ ఇంఛార్జిగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు ఉన్నారు. ఈయనతో పాటు మరో ఎన్నారై వెనిగండ్ల రాము కూడా గతేడాది దసరా నుంచి టీడీపీలో చురుకుగా ఉన్నారు. దీంతో ఈ ఇద్దరూ కూడా టీడీపీ టిక్కెట్ కోసం పోటీ పడుతున్నారు. ఈ ఇద్దరిలో టిక్కెట్ ఎవరికి ఇవ్వాలి అనేదానిపై చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.కొడాలి నానిని ఢీ కొట్టేందుకు చంద్రబాబు పక్కా స్కెచ్ ప్రస్తుతం గుడివాడ టీడీపీ ఇంఛార్జిగా ఉన్న రావి వెంకటేశ్వర రావు గతంలో ఒకసారి ఎమ్మెల్యే గా గెలిచారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు కొన్నేళ్ల క్రితం అమెరికాలో స్థిరపడిన వెనిగండ్ల రాము? స్వస్థలానికి వచ్చి ఈసారి టిక్కెట్ ఎలాగైనా దక్కించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. రావి వెంకటేశ్వరరావుతో సమానంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలతో ప్రజలోనే ఉంటున్నారు. సుమారు ఏడాదిగా అన్న క్యాంటీన్ లు, పండగలకు దుస్తుల పంపిణీ, జాబ్ మేళాలు నిర్వహించడం

,ఇటీవల వరదలు వచ్చినప్పుడు రైతులను పరామర్శించడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు చాలా దగ్గరయ్యారు రాము. దీంతో రావి, వెనిగండ్ల విషయంలో ప్రత్యేకంగా నివేదికలు తెప్పించుకున్నారు పార్టీ అధినేత చంద్రబాబు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండటంతో టిక్కెట్?పై క్లారిటీ ఇవ్వాలని నిర్ణయానికి వచ్చారట. దీంతో రావి వెంకటేశ్వరరావుతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులను పిలిచి చంద్రబాబు మాట్లాడారు. తాజా నివేదికలను రావి వెంకటేశ్వరరావు ముందు ఉంచారట చంద్రబాబు. కొడాలి నానికి సరైన ప్రత్యర్థిగా వెనిగండ్ల రాముకే నివేదికలు అనుకూలంగా ఉన్నట్లు రావికి చెప్పినట్లు తెలిసింది. వెనిగండ్ల రాముకు టిక్కెట్ ఇవ్వడం ద్వారా సామాజిక వర్గాల పరంగాను ఇతర కోణాల్లోనూ నానిని ఢీకొట్టగల సత్తా ఉందని చెప్పారట బాబు. ఇదే సమయంలో రావి వెంకటేశ్వరరావుకు ఎమ్మెల్సీ లేదా మరో మంచి పదవి ఇచ్చి న్యాయం చేస్తానని చంద్రబాబు చెప్పినట్లు సైకిల్ పార్టీ నేతలు చెబుతున్నారుగత ఎన్నికల్లో కొడాలి నానికి పోటీగా దేవినేని అవినాష్?ను బరిలోకి దించారు చంద్రబాబు. అయితే దేవినేని అవినాష్ స్థానికేతరుడు. నియోజకవర్గంపై పట్టు లేదంటూ కొడాలి నాని ప్రచారం చేశారు. నాన్ లోకల్ ఇష్యూతో తెలుగుదేశం పార్టీకి నష్టం కలిగిందని నిర్ణయానికి వచ్చారు చంద్రబాబు. ఈసారి అలాంటి సమస్య లేకుండా వెనిగండ్ల రామును బరిలోకి దింపితే కచ్చితంగా సీటు గెలుస్తామనే అభిప్రాయానికి వచ్చారట బాబు. స్థానికుడు కావడం.. ఇప్పటికే అన్ని వర్గాలతో కలిసిపోవడం, ఆర్థికంగా కూడా బలంగా ఉండటం వెనిగండ్ల రాముకు కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. ఇక కొడాలి నాని హయాంలో గుడివాడ అభివృద్ధి జరగలేదని టీడీపీ ప్రచార అస్త్రంగా చేసుకుంది. తాను గెలిస్తే గుడివాడను ఎలా అభివృద్ధి చేస్తాను అనేది కూడా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు రాము. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే రాముకు టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలోనే వెనిగండ్ల రాముకు గుడివాడ ఇంఛార్జి బాధ్యతలు కూడా అప్పగిస్తారని సమాచారం. మొత్తానికి ఒక పక్క గన్నవరం,మరోపక్క గుడివాడ లో ఈసారి ఎన్నిక లు హోరాహోరీ జరిగే ఛాన్స్ ఉంది.

# విద్యుత్ చార్జీలు.ధరలు తగ్గించాలి. ఉద్యోగాలు,ఉపాధి కావాలి.:-సిపిఎం

విభారే న్యూస్ డోన్ ప్రతినిధి :-దేశంలోని పేద ప్రజలను, యువతీ,యువకులను మోసం చేస్తూ కార్పొరేట్ కంపెనీల కబంధహస్తాలలో నడుస్తున్న బిజెపి మతతత్వ మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు యువతీ,యువకులు సిద్ధం కావాలని సిపిఎం పట్టణ,మండల కార్యదర్శులు నక్కీ శ్రీకాంత్,నాగరాజు,అమెజ మండల అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు.సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శ్రీరామ నగర్ శాఖ కార్యదర్శి షేమిమ్ బేగం అధ్యక్షతన పట్టణంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు.అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పట్టణ,మండల కార్యదర్శులు కార్యదర్శి నక్కి శ్రీకాంత్,కె.నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో,ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైంది. గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీ ఇస్తూ పేద ప్రజలపై పన్నులు,చార్జీల భారాన్ని మోపుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు హద్దు అదుపు లేకుండా ఆకాశాన్ని అందుతున్నాయి.పేదలు మధ్యతరగతి ప్రజానికం ధరల కోరల్లో చిక్కుకుపోతున్నారు.మోడీ గద్దెనెక్కిన వెంటనే 450 రూపాయలు ఉన్న గ్యాస్ లీటర్ ధర 1200 రూపాయలకు పెరిగింది.కంటి తుడుపు చర్యగా అరకొర తగ్గిస్తు.పెట్రోల్,డీజిల్ ధరలు అంతులేకుండా పెరుగుతూనే ఉన్నాయి.కూరగాయ ధరలు ఊహించనంతగా ఈ నెలలోనే 37%



పెరిగాయి,నిత్యవసర సరుకులు 47% పెరిగాయి, పండించిన రైతుకు మాత్రం ధర రాక రోడ్లపై పారబోస్తున్నారు.కందిపప్పు 80 నుండి 160 రూపాయలకు పెరిగింది, మినప్పప్పు,వేరుశనగ,వంట నూనె ధరలు ఒక్క నెలలోనే 22 శాతం పెరిగాయి.పాల ధర 8% పెరిగింది,వేలాది టన్నుల తిండి గింజలు పప్పు దినుసులు అక్రమంగా దాచి కృత్రిమ కొరతను సృష్టించి ధరలు పెంచుతున్నారని వారన్నారు.అధికారంలోకి రాకముందు జగన్మోహన్ రెడ్డి గారు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి.అధికారంలోకి రాగానే 7 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు.ఇప్పుడు నెలవారి పెంపుదలకు రంగం సిద్ధం చేస్తున్నారు,ట్రూ ఆఫ్ చార్జీలు,సర్ చార్జీలు,కస్టమర్ చార్జీలు,ఫిక్స్డ్ చార్జీలు,ఎస్టాబ్లిష్మెంట్ చార్జీలు,ఎలక్ట్రిసిటీ డ్యూటీ మొదలగు పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై రుద్దుతున్నారు.దేశ జనాభాలో 35సంవత్సరాలు వయసులోపు యువత 65% ఉన్నారు.కానీ ఈ యువతకు ఉద్యోగం,ఉపాధి కరువై నిరుద్యోగులుగా రోడ్లపై తిరుగుతున్నారు.మోడీ 2014 ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి గద్దనెక్కారు. కానీ ఆచరణలో సంవత్సరానికి కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా కల్పించలేకపోవడం సిగ్గుచేటు.2017-18 లో 4 శాతం ఉన్న నిరుద్యోగం, 2022లో 7 శాతానికి పైగా పెరిగింది.ఈ నాలుగు సంవత్సరాల

కాలంలో ఒక కోటి 50 లక్షల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు.మతోన్మాద మోడీ ప్రభుత్వానికి ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల, పెట్టుబడిదారుల ప్రయోజనాలు తప్ప దేశ ప్రజల కష్టాలు పట్టడం లేదని వారన్నారు.దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని,అధిక ధరలు అదుపు చేయాలని, సరసమైన ధరలకు నిత్యవసర సరుకులు అందించాలని,కరెంట్ చార్జీలు తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) అఖిల దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది.పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిస్థితి మారాలంటే యావన్మంది ప్రజానీకం ఐక్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న అధిక చార్జీలకు,ధరలకు,పన్నుల బారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాస్, నాగన్న, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కీ హరి,ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇర్ఫాన బేగం,ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అమృత,మా దేవి,షాబానా,వరలక్ష్మి, పాల్గొన్నారు.

## మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



కర్నూలు/మంత్రాలయం, సెప్టెంబర్ 4: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి సోమవారం మధ్యాహ్నం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు.శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం నిర్వహించిన 352వ ఆరాధనోత్సవాల్లో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మఠం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా వారు గ్రామ దేవత మాంచాలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అందచేసిన తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామీజీ నుండి శ్రీ రాఘవేంద్ర స్వామి ప్రతిమ, శేష వస్త్రం, ఫలమంత్రాక్షితలను స్వీకరించారు.తొలుత మంత్రాలయానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పద్మనాభ తీర్థ అతిథి గృహం వద్ద ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శన అనంతరం ఆయన హైదరాబాదు బయలుదేరి వెళ్లారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్, మఠం మేనేజర్ ఎస్ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలోకి రాగానే 24 గంటల నీటి సరఫరా
### పాదయాత్రలో లోకేశ్ హామీలు

ఏలూరు,సెప్టెంబర్4: టీడీపీ అధికారంలోకి రాగానే వాటర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ 24 గంటల పాటూ మంచినీటిని సరఫరా చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన జగన్‌కు.. నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలన్న ఆలోచన లేదన్నారు. తామొచ్చాక లో ఓల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ ను ప్రజలు, ఆక్వా రైతులకు అందిస్తామన్నారు. వరి ధాన్యానికి గిట్టుబాటు ధర అందిస్తామని చెప్పారు. విద్యుత్ ఛార్జీలను నియంత్రిస్తామని రాష్ట్రంలో జె.బ్రాండ్ల మద్యం నిషేధిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.టీడీపీ యువనేత నారా లోకే యువగళం పాదయాత్ర పశ్చిమగోదావరి జిల్లాలో కొనసాగుతోంది. సోమవారం 204వ రోజు పాదయాత్రను ఉండి మండలం కోలమూరు నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉండి మండలం కోలమూరు గ్రామస్తులు లోకేశ్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని.. మురికి నీరు తాగడంతో అనారోగ్య సమస్య ఎదురువుతున్నాయని తెలిపారు. ఆక్వా రైతులందరికీ విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. విద్యుత్ కోతల సమస్యతో రొయ్యులు డీఓ సమస్యతో చనిపోతున్నాయన్నారు.

# కళంకారిని రాష్ట్రకళగా ప్రకటించేందుకు కృషి

**- టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకర్‌రెడ్డి**
**- ఎస్వీ శిల్పకళాశాలలో ప్రారంభమైన మూడు రోజుల వర్క్‌షాప్**







తిరుపతి, 2023 సెప్టెంబరు 04: కళంకారిని రాష్ట్రకళగా ప్రకటించేలా ముఖ్యమంత్రి శ్రీ వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ని ఒప్పిస్తానని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు . ఎస్వీ సంప్రదాయ శిల్ప శిక్షణ సంస్థలో సంప్రదాయ ఆలయ శిల్పకళలు - అనుబంధ అంశాలపై మూడు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఛైర్మన్ మాట్లాడుతూ శిల్పకళాశాలలో కళంకారి రెండేళ్ల సర్టిఫికెట్ కోర్సును నాలుగేళ్ల డిప్లొమా కోర్సుగా మార్చేందుకు బోర్డులో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. 30 వేల సంవత్సరాల క్రితమే శిల్పకళ ప్రారంభమైందని, కళల్లో శిల్పకళకు గొప్ప స్థానం ఉందని చెప్పారు. వేల సంవత్సరాల క్రితమే ఆలయాలు, ప్రార్థనా మందిరాల నుండి ఈ కళ ప్రారంభమైందన్నారు . ప్రపంచంలోని ప్రతి దేశ చరిత్రకు శిల్పకళ ఆధారభూతమైందని వివరించారు. శిల్పకళ విద్యార్థుల నైపుణ్యం గొప్పదన్నారు. 17 సంవత్సరాల క్రితం ఈ కళాశాల పరిస్థితి చూసి సామూహిక మార్పులు చేశానన్నారు. ఈ కళాశాల విద్యార్థులతో అర అడుగు, ఒక అడుగు మేర శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిమలు తయారు చేయించాలని గతంలో భావించానని చెప్పారు. స్వామివారు తనకు మళ్లీ అవకాశం ఇచ్చారని చెప్పారు. ఇలాంటి విగ్రహాలు ప్రతి ఇంట్లో ఉంచుకోవడం ద్వారా స్వామివారు తమతోనే ఉన్నారన్న భావన భక్తులకు కలుగుతుందని తెలిపారు.

మూడు రోజుల వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మరింత పెంచుకోవాలని, శిల్పకళాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. జేఈవో శ్రీమతి సదా భార్గవి మాట్లాడుతూ గతంలో ఛైర్మన్ శ్రీ కరుణాకర్‌రెడ్డి హయాంలోనే కళాశాలకు సొంత భవనం ఏర్పాటైందని చెప్పారు . వర్క్‌షాపులో పనిచేస్తున్న శిల్పులకు ధరలు పెంచారని చెప్పారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని శ్రీ కరుణాకర రెడ్డి చైర్మన్ గా ఉన్నప్పుడే ప్రకటించారని తెలియజేశారు. అదేబాటలోనే ప్రస్తుతం పయనిస్తూ కళాశాలను ప్రగతిపథంలో నడిపిస్తున్నామని చెప్పారు. వర్క్‌షాప్‌లు నిర్వహించి విద్యార్థులకు శిల్పకళలోని మెళకువలపై అవగాహన కల్పించామని తెలిపారు. కళాశాల ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 815 మంది విద్యార్థులను శిల్పులుగా తయారు చేసినట్టు తెలియజేశారు. శిల్పకళా ప్రదర్శన ప్రారంభం కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన శిల్పకళాప్రదర్శనను ఛైర్మన్ ప్రారంభించారు. ఇందులో ఆలయ నిర్మాణకళ, శిలా విగ్రహాలు, సుధా(సిమెంటు) విగ్రహాలు, కొయ్య విగ్రహాలు, లోహ విగ్రహాలు, సంప్రదాయ చిత్రకళ, సంప్రదాయ కళంకారి కళ, హస్తకళా ప్రదర్శనలు ఉన్నాయి. కుమారి పి.సాయిదేవిక నిరుపయోగమైన వస్తువులతో తయారుచేసిన వివిధ కళాకృతుల స్టాల్‌ను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. గాజుసీసాలు, మట్టికుండలు, జ్యూట్‌తో తయారుచేసిన గృహాలంకరణకు ఉపయోగపడే అనేక కళాకృతులు ఈ స్టాల్‌లో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ బోరు&ధ సభ్యులు శ్రీ యానాదయ్య, విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ప్రముఖ స్థపతి శ్రీ సంతానకృష్ణన్, శ్వేత డైరెక్టర్ శ్రీమతి ప్రశాంతి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వెంకటరెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీసుల వేధింపులతో యువకుడి బలవన్మరణం

### ప్రేమపెళ్లి చేసుకున్నా..విడిపోయిన యువకుడు

ఏలూరు,సెప్టెంబర్4: ఎనిమిదేళ్లుగా ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ యువకుడి బలవన్మరణం ఆందోళణ కలిగిస్తోంది. ప్రేమ వివాహం.. పోలీసుల వేధింపులతో యువకుడి ఆత్మహత్య కలకలం రేపుతోంది. దెందులూరు సమీపంలో రైలు కిందపడి తేజామూర్తి అనే యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఏలూరుకు చెందిన ప్రియాంక అనే యువతితో ఎనిమిదేళ్ళ నుంచి తేజా ప్రేమలో ఉన్నారు. మూడునెలల క్రితం వీరిరువురూ వివాహనం చేస్తున్నారు. అయితే ఇరువురి మధ్య మనస్పర్ధల కారణంగా ఇటీవల తేజాపై ప్రియాంక ఏలూరు వన్‌టౌన్లో ఫిర్యాదు చేసింది. పలుమార్లు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ పేరుతో సీఐ రాజశేఖర్ సెటిల్‌మెంట్ చేసుకోవాలంటూ వేధింపులకు గురిచేశాడు. సెటిల్‌మెంట్ చేసుకోక పోతే కేసు నమోదు చేస్తామని పోలీసుల ద్వారా ప్రియాంక కుటుంబ సభ్యులు బెదిరింపులకు దిగారు. పోలీసుల బెదిరింపుల నేపథ్యంలో ఒత్తిడికిలోనై తేజా ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభ్యమైంది. వెంటనే రైల్వే సిబ్బంది అక్కడకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చిరంజీవి ఐ హాస్పిటల్ ఉచిత కంటి పరీక్ష శిబిరం



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 04,ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చిరంజీవి ఐ హాస్పిటల్ సహకారంతో సోమవారం ఉచిత కంటి పరీక్ష శిబిరంనిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కే మెహబూబ్ భాష మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానమని, అన్ని ఇంద్రియాల లోను కళ్ళు చాలా ప్రధానమైన ఇంద్రియమని వాటిని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని తెలిపారు.అనంతరం చిరంజీవి ఐ హాస్పిటల్ డాక్టర్ అనూష మాట్లాడుతూ విద్యార్థులు మంచి పోషక ఆహారం తీసుకొని, అలాగే కళ్ళను జాగ్రత్తగా చూసుకోవాలని, ఏదైనా కళ్ళ ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు ఐ డాక్టర్ను సంప్రదించాలని తెలిపారు. ఆంగ్ల అధ్యాపకులు ఎన్ న్యూటన్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా మొబైల్ ఫోన్లను ఉపయోగించడం వల్ల కళ్ళు దెబ్బతింటున్నాయని, అలాగే మంచి పోషక ఆహారాన్ని తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హెచ్ కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంతిని గుర్తించి నేత్ర నరాల ద్వారా మెదడుకు సమాచారాన్ని అందించే అవయవమని,ఇవి మానవులలో ముఖ్యమైన జ్ఞానేంద్రియం. మానవునికి ముఖంలో రెండువైపులా అమర్చబడి ఉంటాయి. ఇవి మనుషులలో కెమెరా వలె పనిచేసి, బాహ్య రూపాల్ని రంగులతో సహా ఉన్నది ఉన్నట్లుగా మెదడుకి పంపుతాయని, అలాంటి కళ్ళను జాగ్రత్తగా చూసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. కళాశాల సూపరింటెండెంట్ కె మద్దిలేటి మాట్లాడుతూ కళ్ళు మనిషికి చాల ప్రధానమైనవి. అంధకారమైన జీవితము ఊహించడానికి కూడా సాహసించరని,కళ్ళను మనము జాగ్రత్తగా కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమావేశము అనంతరం అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తో పాటుగా 150 మంది విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కే తిరుపతిరెడ్డి, కే మనోరంజన్, ఎన్ తిప్పేస్వామి, రామాంజనేయులు, మోహన్ నాయుడు, నరసింహులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో ఘనంగా కవి గాయకుడు పొద్దుపొడుపు శంకర్ జన్మదిన వేడుకలు.



రాజన్న సిరిసిల్ల.సెప్టెంబర్ 04, విజయ తెలంగాణ,రాజన్న సిరిసిల్ల జిల్లా తంగాళ్లపల్లి మండలకేంద్రంలో సోమవారం రోజున తెలంగాణా ప్రముఖ కవి గాయకుడు యూట్యూబ్ స్టార్ బతుకమ్మ సాంగ్స్ ఫేమ్ పొద్దుపొడుపు శంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు ఎడమల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది,తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన పాటల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేయడంలో పొద్దుపొడుపు కృషి వెలకట్టలేనిది,బంగారు తెలంగాణ నే లక్ష్యంగా తన ఆట పాటలతో తెలంగాణ సాంస్కృతిక సారథి లో అనేక పాటలతో తెలంగాణా ప్రజలను ఉర్రుత లుగిస్తున్న పొద్దుపొడుపు శంకర్ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఈసందర్భంగా ఎడమల శ్రీధర్ రెడ్డి కొనియాడారు, ఈకార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారులు ఎడమల శ్రీధర్ రెడ్డి,గుగ్గిళ్ల పర్శరాములు, శ్రీరాముల రామచంద్రమ్ ,వంతడుపుల గణేష్,గడ్డం శ్రీనివాస్ ,అనుముల శిరీష,పొత్తూరి రాజు,గడ్డం దేవయ్య,పుదారి సంజీవ్,అంతడుపుల రఘాన్సీ,కిన్నెర శ్రీలత,అంతడుపుల లావణ్య.తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా శ్రీ రామిరెడ్డి, శ్రీ అశ్వర్థ నాయక్ ప్రమాణ స్వీకారం

టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా శ్రీ రామిరెడ్డి, శ్రీ అశ్వర్థ నాయక్ సోమవారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలో స్వామివారి సన్నిధిలో వీరి చేత జేఈవో శ్రీ వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం వీరికి ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ లోకనాథం శ్రీవారి తీర్థ



ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో శ్రీమతి కస్తూరి బాయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190